సాక్షి అనకాపల్లి

సోమవారం । 14 । అక్టోబర్ । 2024



జగనన్న సంకల్పం.. నేటితో సాకారం

గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం సాకారమయ్యేవేళ ఆసన్నమైంది. పాడేరులో నిర్మించిన వైద్య కళాశాల సోమవారం ప్రారంభం కానుంది. 8లో



రేపటి నుంచి ఎస్జీఎఫ్ పోటీలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీలు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు 15 నుంచి నిర్వహించనున్నారు. 8లో



ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

కనకమహాలక్ష్మి దేవస్థానంలో పది రోజులుగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. 8లో



కచ్చితమైన సమాచారం అందించి.. తుపాన్లు, వరదల ముంపు బారిన సాధారణ ప్రజలు, మత్స్యకారులు పడకుండా జాగ్రత్తలు చెబుతున్నామని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం ప్రధాన అధికారి భారతీ ఎస్ సబడే అన్నారు. మత్స్యకారులందరికీ మరింత ఉపయుక్తమయ్యేలా ఇకపై తెలుగులోనూ రోజువారీ హెచ్చరికలు జారీ చేస్తామని తెలిపారు. కైలాసగిరిపై ఏర్పాటు చేసిన డాప్లర్ రాడార్ ఆధునికీకరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. తుపాను హెచ్చరికల్లో అత్యాధునిక పద్ధతులకు శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో 'సాక్షి'తో ఆమె పలు విషయాల్ని పంచుకున్నారు.

-సాక్షి, విశాఖపట్నం

వెదర్ రిపోర్ట్ ఇక తెలుగులోనే..

- **తుపాను సమాచారం అందరికీ అందుబాటులోకి తీసుకొస్తున్నాం**
- **విశాఖ రాడార్ ఆధునికీకరణ పనులు త్వరలో ప్రారంభం**
- విశాఖకు 500 కిలోమీటర్ల పరిధిలో తుపాను సూచనల సమాచారం సేకరిస్తున్నాం
- దాదాపు కచ్చిత సమాచారం అందిస్తున్నాం
- తుపాను ప్రభావాల్లో విశాఖనగరం పీ2 రేంజ్‌లో ఉంది
- విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం చీఫ్ భారతి ఎస్ సబడే

సాక్షి ఇంటర్వ్యూ

రాడార్ ఆధునికీకరణ

ఒకప్పుడు డాల్ఫిన్ నోస్‌పై సైక్లోన్ డిటెక్షన్ రాడార్ ఉండేది. దాన్ని ఆధునికీకరిస్తూ కైలాసగిరిపై 2006లో డాప్లర్ వెదర్ రాడార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశాం. ఇది పూర్తిగా జర్మన్ టెక్నాలజీ అయిన జెమట్రోనిక్ ఎస్‌బ్యాండ్ డాప్లర్. దాదాపు 18 ఏళ్ల పాటు నిర్విరామంగా సేవలందిస్తోంది. హుద్‌హుద్ సమయంలో కీలకంగా వ్యవహరించింది. అయితే.. ఇటీవల మరమ్మతులకు గురైతే.. సరిచేశాం. దేశవ్యాప్తంగా పాత రాడార్లని ఆధునికీకరించేందుకు ఐఎండీ శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా.. కైలాసగిరిపై ఉన్న ఈ రాడార్ ఆధునికీకరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తాం.



కైలాసగిరిపై డాప్లర్ రాడార్

500 కిమీ పరిధిలో..

విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం నుంచి వాతావరణ సమాచారం అందిస్తున్నాం. కేవలం ఉత్తరాంధ్ర జిల్లాలకే కాకుండా ఒడిశాలోని కొన్ని భాగాలకు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకూ ఇలా మొత్తం విశాఖ నుంచి 500 చ.కిమీ విస్తీర్ణం పరిధిలో ఉన్న స్టేక్ హోల్డర్‌లకు నిరంతరం వెదర్ అప్‌డేట్స్ అందిస్తున్నాం.

పీ2 పరిధిలో విశాఖ

ఏపీలో తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్ని ఐఎండీ గత అనుభవాల ప్రకారం గుర్తించింది. ఉమ్మడి జిల్లాల పరిధిలో చూస్తే.. మొత్తం 9 జిల్లాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అంటే తీరం దాటే అవకాశాలు ఈ పరిధిలోనే జరుగుతుంటాయి. తుపాను తీవ్రత, తీరందాటే అవకాశాలను రెండుగా విభజించారు. ఇందులో నెల్లూరు, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలు వెరీ హై ప్రోన్ (పీ1) జాబితాలో ఉండగా.. శ్రీకాకుళం, గుంటూరు, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, ప్రకాశం, విజయనగరం పీ2 పరిధిలో ఉన్నాయి.

త్వరలో తెలుగు బులెటిన్

ప్రతి రోజూ నిరంతర వాతావరణ సమాచారం, ఈదురుగాలుల ప్రభావం, తుపాను ప్రభావం, సముద్రం అల్లకల్లోలంగా ఉందా లేదా, వర్షం పడుతుందా లేదా..? మొదలైన కచ్చితమైన వాతావరణ సమాచారం అందిస్తున్నాం. అయితే ప్రస్తుతం ఇంగ్లీష్ భాషలో అందిస్తూ.. వివిధ మాధ్యమాల ద్వారా మత్స్యకారులకు చేరవేస్తున్నాం. ఇకపై ఐఎండీ సూచనలకు అనుగుణంగా ప్రాంతీయ భాష తెలుగులోనూ నిరంతర బులిటిన్స్ అందజేయనున్నాం. త్వరలోనే దీన్ని అందుబాటులోకి తీసుకొస్తాం.

రంగుల ఆధారంగా హెచ్చరికలు జారీ

తుపాను సమయంలోనూ అల్పపీడనాల సమయంలోనూ విడుదల చేసే బులిటిన్స్‌లో వాటి ప్రభావాన్ని సులువుగా మత్స్యకారులు, ఇతర స్టేక్ హోల్డర్లు గుర్తించేందుకు ప్రత్యేకంగా రూపొందిస్తాం. ఉదాహరణకు గాలుల వేగాన్ని సులువుగా తెలుసుకునేందుకు విభిన్న రంగుల్లో అందిస్తాం. ఉదాహరణకు గాలుల వేగం గంటకు 31 కిమీ కంటే తక్కువగా ఉన్నప్పుడు స్కై బ్లూ, 31–49 కిమీ అయితే లేత ఆకుపచ్చ, 49–61కిమీ అయితే ఆరెంజ్, 61–85 కిమీ అయితే ఊదారంగు, 85–117 కిమీ అయితే పసుపు రంగు, 117–166 కిమీ అయితే.. ముదురు ఎరుపు రంగు, 166–221 కిమీ అయితే నీలం రంగుతో మ్యాప్‌లలో సూచిస్తాం. వీటిపై మత్స్యకారులకు ఇప్పటికే అవగాహన కల్పించాం. దీనిద్వారా కూడా మత్స్యకారులు అప్రమత్తమవుతున్నారు. ప్రతిసారీ దాదాపు అన్ని వాతావరణ విషయాల్లోనూ విశాఖ సీడబ్ల్యూసీ నుంచి కచ్చితమైన సమాచారం అందిస్తున్నాం. భవిష్యత్తులో మరింత మెరుగుపడే దిశగా అడుగులు వేస్తున్నాం.



ఈ-ఐ కేంద్రాలకు చంద్ర గ్రహణం



అస్పత్రుల్లో నెలరోజులుగా అందని సేవలు

- **పరీక్షలతో పాటు ఉచిత కళ్లజోడు పంపిణీ నిలిపివేత**
- **ఆస్పత్రుల నుంచి సామగ్రి తరలించుకుపోయిన అపోలో సంస్థ**
- **కంటి వైద్య పరీక్షల కోసం పేద,మధ్యతరగతి ప్రజల అవస్థలు**
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి



యలమంచిలి రూరల్: కంటి సమస్యలతో బాధపడే పేద,మధ్యతరగతి వర్గాలకు సేవలందించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది.గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రాధాన్యతతో నిర్వహించిన ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూతపడ్డాయి.ఈ కేంద్రాలను 2018లో ప్రారంభించినప్పటికీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కంటి జబ్బులకు సంబంధించి ఓపీ దగ్గర్నుంచి శస్త్రచికిత్సల వరకు అన్ని సేవలు ఉచితంగా అందించేవారు. ఈ కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలందించేందుకు గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేకంగా ఆప్తాల్మిక్ అసిస్టెంట్లను కూడా నియమించారు. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల(సీహెచ్‌సీ)లో ఈ కేంద్రాలు నిర్వహించగా గత నెల 4వ తేదీ నుంచి వీటిలో సేవలు నిలిపివేశారు.వ్యాధి నిర్ధారణ చేసిన వారికి సెప్టెంబరు 16వ తేదీ వరకు కళ్లజోళ్ల పంపిణీ జరిగింది.ప్రత్యేకంగా నియమించిన ఆప్తాల్మిక్ అసిస్టెంట్లను సైతం కొద్ది నెలల క్రితం తొలగించారు. వారికి చెల్లించాల్సిన వేతన బకాయిలను కూడా చెల్లించలేదు.ఈఐ కేంద్రాల్లో సామగ్రి,వైద్య పరికరాలు, కంప్యూటర్లను కాంట్రాక్టు సంస్థ అపోలో ప్రతినిధులు తరలించుకుపోయారు. కంటి వైద్య పరీక్షల కోసం ప్రతి రోజూ పదుల సంఖ్యలో సీహెచ్‌సీలకు వస్తున్న పేద ప్రజలు కేంద్రాలు మూతపడిన సంగతి తెలుసుకుని నిరాశతో వెనుదిరుగుతున్నారు. అత్యవసరంగా కంటి వైద్య పరీక్షలు అవసరమైన వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.అక్కడ వైద్యం బాగా ఖరీదు కావడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈఐ కేంద్రాలను వెంటనే తెరిచేందుకు చర్యలు తీసుకోవాలని పేద,మధ్య తరగతి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం అనకాపల్లి ఎన్టీఆర్ ప్రాంతీయ వైద్యశాలలో మినహాయిస్తే జిల్లాలో ఎక్కడా ఆప్తమాలజిస్టు సేవలు కూడా అందుబాటులో లేవు.

2,81,725 మందికి వైద్య పరీక్షలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 2,81,725 మంది కంటి చికిత్సలు పొందినట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.ఒక్కో ఈ–ఐ కేంద్రంలో రోజుకు 25 నుంచి 75 మంది వరకు ఓపీలు నమోదు చేసుకునే వారు.అన్నిరకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి రెండు వారాల్లోపే కళ్లద్దాలు అందించేవారు. దీంతో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలకు గ్రామీణుల నుంచి ఆదరణ పెరిగింది.కళ్లలో పొరలు,శుక్లాల సమస్యలు ఉన్నవారిని గుర్తించి జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించేవారు.కంటి చికిత్సలకు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీకి రూ.200 అవుతుంది.కళ్లద్దాలు కావాలంటే రూ.2000 అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి.ఫలితంగా పేదలపై భారం పడనుంది.

అదేవిధంగా ఒప్పంద గడువు పొడిగించకపోవడంతో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో 8 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు జీవనోపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ తమ సేవల్ని కొనసాగిస్తారన్న ఆశ వారిలో ఉంది.పేద ప్రజల ఇబ్బందుల దృష్ట్యా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తక్షణమే ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల సేవలను పునఃప్రారంభించాలని వారంతా కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో సీఎం ఈ ఐ కేంద్రాల ద్వారా అందించిన సేవలు


సీహెచ్‌సీలు	:	9
ఇప్పటివరకు నిర్వహించిన కంటి పరీక్షలు	:	2,81,725
రిఫ్రాక్షన్ చెక్స్	:	2,69,920
ఫండస్ చెక్స్	:	1,09,461
మంజూరు చేసిన కళ్లజోళ్లు	:	2,29,342
శస్త్రచికిత్సలు	:	11,498
గుర్తించిన ఇతర వ్యాధులు	:	1481



యలమంచిలి ఆస్పత్రిలో ఖాళీ అయిన ఈ-ఐ కేంద్రం గది

తొమ్మిది కేంద్రాల మూత

ఉమ్మడి విశాఖ జిల్లాలో పేద,మధ్యతరగతి వర్గాలకు కంటి వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ,అపోలో హాస్పిటల్స్ సంయుక్తంగా ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఉమ్మడి జిల్లాలో నక్కపల్లి, యలమంచిలి, చోడవరం,కె.కోటపాడు,పెందుర్తి,అగనంపూడి,భీమిలి, పాడేరు,అరకు సీహెచ్‌సీల్లో వీటిని ఏర్పాటు చేశారు.ఒక్కో కేంద్రంలో ఒక విజన్ అసిస్టెంట్ లేదా ఆప్తాల్మిక్ అసిస్టెంట్,ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్‌లను నియమించారు. వీరిని సమన్వయం చేసేలా జిల్లాస్థాయి పర్యవేక్షకుడిని నియమించారు.ప్రతి కేంద్రంలో కంటి పరీక్షలకు సంబంధించి ఆటో మేటిక్ రిఫ్రాక్టర్ మీటర్,కంటి లోపల భాగాలను పరీక్షించే ఫండస్ కెమెరాలను ఏర్పాటు చేశారు.కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అవసరమైన వైద్యసాయం,కళ్ల జోళ్లు,శస్త్రచికిత్సలు అందించేవారు.కేంద్రం నిర్వహించడానికి వీలుగా అవసరమైన ఫర్నిచర్ కూడా సమకూర్చారు. రోజూ పరీక్షలు చేసి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేవారు.పేదల వైద్యానికి పెద్దపీట వేసిన గత వైఎస్ జగన్ ప్రభుత్వం కంటి వైద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చింది.ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల నిర్వహణతో పాటు వృద్ధులు,విద్యార్థుల కోసం గ్రామాల్లో,పాఠశాలల్లో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరాలను నిర్వహించారు.గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలతో ఎంవోయూ(మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్) గడువు ముగియగా కంటి వైద్య సేవలు నిలిచిపోకుండా గత ప్రభుత్వం పలుమార్లు రెన్యువల్ చేస్తూ వచ్చింది.కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మాత్రం అపోలో సంస్థతో కాంట్రాక్టు గడువు ముగిసినా, కేంద్రాలు మూతపడినా పట్టించుకోకపోవడంతో పేద వర్గాల ప్రజలు కంటి సంబంధిత వైద్య సేవల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.



Yellamanchili CHC


ది. 05-09-2024 నుంచి కంటి పరీక్షలు, ఉచిత కళ్లజోళ్ల పంపిణీ నిలిపివేయబడినది.

దయచేసి పేషెంట్స్ గమనించగలరు

Contact no. [illegible]2

యలమంచిలి సీహెచ్‌సీలో కంటి పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ నిలిపివేసినట్టు అతికించిన నోటీసు

కంటి పరీక్షలు ప్రారంభించాలి



ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో వెంటనే కంటి వైద్య పరీక్షలు ప్రారంభించాలి.ఈ కేంద్రాల వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరిగింది. గ్రామీణులకు అందుబాటులో ఉండే ఈ–ఐ కేంద్రాల మూతతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. కులవృత్తి చేసుకునే పేద వర్గాల వారికి ఈ కేంద్రాలు ఎంతో అవసరం.

– **కందికుప్ప గోవిందరావు**, నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి

యలమంచిలి ఆస్పత్రికి వెళ్లి తిరిగొచ్చాను



మాది సోమలింగపాలెం గ్రామం.ఇద్దరు పిల్లలకు కంటి వైద్య పరీక్షలు చేయిద్దామని ఇటీవల యలమంచిలి ఆస్పత్రికి వెళ్లాను. ఈ–ఐ కేంద్రాలు మూతపడ్డాయని గోడకు అతికించిన నోటీసు చూసి వెనుదిరిగాను.మా గ్రామం నుంచి యలమంచిలి ఆస్పత్రికి సుమారు 8 కిలోమీటర్ల దూరం.రెండు వైపులా 16 కిలోమీటర్లు ఎంతో శ్రమ పడి వెళ్లినా ప్రయోజనం లేకపోయింది.కేంద్రాలను మూసివేయడం వల్ల మాలాగ చాలా మంది ఇబ్బంది పడుతున్నారు.ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాలంటే పేదలకు భారంగా ఉంటోంది.

– **యల్లపు శ్రీనివాసరావు**, సోమలింగపాలెం, యలమంచిలి మున్సిపాలిటీ

గత నెల నుంచే మూతపడ్డాయి

కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలు గత నెల 4 వ తేదీ నుంచి మూతపడ్డాయి. అప్పటివరకు వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు కూడా అపోలో సంస్థ అందజేసింది.ఈ–ఐ కేంద్రాల నిర్వహణపై అపోలోతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ముగియడంతోనే మూసివేసినట్టు తెలుస్తోంది.ఇందుకు సంబంధించి రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. కేంద్రాలు ఎప్పుడు ప్రారంభిస్తారనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఆ మేరకు మళ్లీ సేవలు ప్రారంభమవుతాయి.

– **శ్రీనివాసరావు**, డీసీహెచ్‌ఎస్, అనకాపల్లి

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- అనకాపల్లి జిల్లా ఎస్పీ దీపిక
- ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ

ఆరిలోవ(విశాఖ): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు దృఢ సంకల్పంతో కృషి చేయాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక సూచించారు. విజయదశమి సందర్భంగా శనివారం విశాఖ సిటీలోని విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె జిల్లా పోలీస్ అధికారులతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పోలీస్ వ్యవస్థలో ఆయుధాలు ఒక భాగమని, వాటిని అందరూ గౌరవించాలని కోరారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, వి.సత్తిరాజు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు బాలసూర్యారావు, సతీష్, మన్మధరావు, నర్సింహమూర్తి, ఎస్‌ఐలు నాయుడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.




విశాలాక్షినగర్ ఏఆర్ కార్యాలయంలో పూజలు చేస్తున్న అనకాపల్లి ఎస్పీ దీపిక

నేటి నుంచి 'పల్లె పండగ'

సాక్షి, అనకాపల్లి: జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్యాలయాల్లో 'పల్లె పండగ' పేరిట వారోత్సవాలు జరగున్నాయి. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ వారం రోజుల పాటు 'పల్లె పండగ పంచాయతీ' వారోత్సవాలను నిర్వహించనున్నారు. సోమవారం నుంచి ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లు ప్రారంభిస్తారు. ఆగస్టు 23న జిల్లాలో 645 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి, తీర్మానాలు చేశారు. ఈ గ్రామ పంచాయతీల్లో పల్లె పండగ పేరిట గ్రామ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు డ్వామా పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. కలెక్టర్ విజయక్రిష్ణన్ ఆదేశాల మేరకు మొత్తం 2,343 పనులకు గానూ రూ.214 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో 1,697 మౌలిక సదుపాయాల పనులకు గాను రూ.172.3 కోట్లు, స్వతంత్ర అభివృద్ధి పనులకు గాను రూ.41.7 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. గ్రామ సభల్లో నోటిఫై చేసిన పనులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, వాటినే చేస్తారు.

ప్రమాద స్థాయిలో పెద్దేరు నీటిమట్టం



పెద్దేరు జలాశయం నుంచి దిగువకు విడుదల చేస్తున్న వరద నీరు

మాడుగుల: మండలంలోని పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురవడంతో జలాశయం నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. రెండు రోజుల కిందట 150 క్యూసెక్కుల ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం ఉదయానికి 310 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయం అధికారులు అప్రమత్తమై ప్రధాన గేటుద్వారా 300 క్యూసెక్కులను పెద్దేరు నదిలోకి విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.70 మీటర్లకు చేరుకుంది.

నేత్రపర్వంగా శమీపూజ

- పుణ్యకోటివాహనంపై తిరువీధిసేవ
- కన్నుల పండువగా చక్రస్నానం
- ముగిసిన బ్రహ్మోత్సవాలు



శమీపూజ నిర్వహిస్తున్న అర్చక స్వాములు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం విజయదశమినాడు శమీపూజ, చక్రస్నానం, లక్ష్మీసంవాదం నేత్రపర్వంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి ఉంగరం మాయంకావడ, దాన్ని వెతికే సన్నివేశం భక్తులను ఆకట్టుకున్నాయి. శనివారం ఉదయం స్వామివారికి నిత్యార్చనలు, ప్రత్యేకహోమాలు నిర్వహించారు. గ్రామబలిహరణలు, నాలాయిర సేవాకాలం, రాజభోగనివేదన, తీర్థగోష్టి, ప్రసాదవినియోగం జరిగింది. సాయంత్రం ఉభయదేవేరులతో స్వామివారిని పుణ్యకోటి వాహనంపై బందుర సరస్సు వద్ద ఉన్న మండపం వద్దకు తీసుకెళ్లి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. తర్వాత జమ్మిచెట్టుకు,స్వామివారి ధనుర్బాణాలకు ప్రత్యేక ఆరాధనలు చేశారు.ఆలయ అర్చక స్వాములు స్వామివారి ధనుర్బాణాలను సంధించే ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ప్రసాద నివేదన చేసి తీర్థగోష్టి, ప్రసాద వినియోగం చేశారు. అనంతరం స్వామి వారి తిరువీధి సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో జరగాల్సిన గ్రామబలిహరణలు నిర్వహించారు.

స్వామివారి ఉంగరం మాయం

వేంకటేశ్వరస్వామి ఉంగరం పడిపోయింది. మీలో ఎవరు తీశారో చెప్పాలంటూ అర్చక స్వాములు విజయదశమి సందర్భగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులను ఆపి నిలదీయడంతో ఒక్కసారిగా ఉత్కంఠనెలకొంది. ఉంగరం మేంతీయలేదంటే మేంతీయలేదు, మాకు దొరక లేదంటూ అందరూ చెప్పినప్పటికీ అర్చకులు వినలేదు. అనుమానంతో కొంతమందిభక్తులతోపాటు,ఒకరిద్దరు టీటీడీ ఉద్యోగులను బంధించి ఉంగరం గురించి గట్టిగా ఆరా తీయడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. బ్రహ్మోత్సవాలకు వచ్చిన వారే స్వామి వారి ఉంగరం కాజేశారంటూ అర్చకులు నిందమోపడంతో అందరూ ఆందోళన చెందారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మృగవేట సమయంలోస్వామివారు తాను ధరించిన ఉంగరం పోగొట్టుకున్నారు. ఈ ఉంగరం ఉంటేనే గాని ఉభయనాంచారులు స్వామివారిని గర్భాలయప్రవేశానికి రానీయరు.దీంతో అర్చకులు ఉంగరం కోసం గాలించారు. చివరగా స్వామివారు ధరించిన వస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్వామివారు ధరించిన వస్త్రాల్లోనే ఉంగరం ఉందని, కంగారు పడొద్దని అర్చకులు చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.అప్పటివరకు ఉంగరం కనిపించకపోవడం నిజమని భావించిన భక్తులంతా ఈ కార్యక్రమం స్వామివారి బ్రహోత్సవాల్లో భాగమని, వినోదోత్సవమని తెలిసి ఆనంద పరవశులయ్యారు.



భక్తులను బంధించి విచారిస్తున్న అర్చక స్వాములు




చక్రస్నానం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మీసంవాదం.. చక్రస్నానం..

ఆలయంలో నిర్వహించిన లక్ష్మీ సంవాదం కార్యక్రమం అందర్నీ అలరించింది. ఆలయంలోకి స్వామివారి ప్రవేశాన్ని ఉభయ దేవేరులు అడ్డుకుంటారు. మీరెవరో చెప్పాలని వారు పట్టుబట్టడంతో తాను వెంకటేశ్వరస్వామినని చెప్పడంతో శ్రీదేవీ, భూదేవీ స్వామివారిని గర్భాలయ ప్రవేశానికి అంగీకరిస్తారు. ఈ సందర్భంగా జరిగిన సంవాదం సన్నివేశాన్ని తిలకించిన భక్తులు ఆనందపరవశులయ్యారు. తదుపరి కొట్నాల ఉత్సవం జరిగింది.తర్వాత చూర్ణోత్సవం నిర్వహించారు. తదుపరిబందుర సరస్సు వద్ద స్వామి వారి చక్రస్నానం నేత్రపర్వంగా నిర్వహించారు.అనంతరం అద్దపు సేవ, కంకణవిసర్జన, తిరుమంజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకస్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలా చార్యులు, రాజగోపాలాచార్యులు, సాయి ఆచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. పదిరోజులపాటు జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయని ప్రధానార్చకులు తెలిపారు.

సరుగుడు వద్ద సందర్శకుల సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే నీటిలో స్నానాలు చేసి ఉత్సాహంగా గడిపారు. విద్యార్థులకు విజయదశమి సెలవులు కావడంతో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. జలపాతాన్ని సందర్శించేందుకు టూరిస్టులు అధిక సంఖ్యలో వాహనాల్లో రావడంతో రద్దీ పెరిగింది. అనంతరం తాండవ రిజర్వాయర్‌ను చూసేందుకు సందర్శకులు తరలివచ్చారు.

క్లుప్తంగా

యువ హీరోల సందడి



అనకాపల్లిలో శనివారం రాత్రి యువ హీరోలు సందడి చేశారు. సతకంపట్టు కనకదుర్గమ్మను సినీహీరో సందీప్ కిషన్, డైరెక్టర్ నక్కిన త్రినాథ్, చిత్రీకరణ జరుపు కొంటున్న అనకాపల్లి కుర్రోళ్లు కొత్త సినిమా హీరో సహిదేవ్, హీరోయిన్ సంధ్య దర్శించుకున్నారు. - అనకాపల్లి

ఘనంగా కనకదుర్గ నిమజ్జనం

- బోనాలతో తరలివచ్చిన మహిళలు



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు అమ్మవారి చిత్ర పటాన్ని బహూకరిస్తున్న ఆలయ అధికారులు

నర్సీపట్నం : శ్రీశ్రీశ్రీ దుర్గమల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి నవరాత్రులు ముగింపు సందర్భంగా ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు, సతీమణి పద్మావతి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, దేవదాయ శాఖ ఈవో సాంబశివరావు పూర్ణ కుంభంతో స్పీకర్ దంపతులకు స్వాగతం పలికారు. వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. బలిఘట్టం కనకదుర్గమ్మ ఆలయ కమిటీ వారు అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఊరేగింపులో మహిళలు బోనాలతో కదం తొక్కారు.

పల్లెపండగ ఘనంగా నిర్వహించాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగను ఘనంగా నిర్వహించాలని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు నాయకులకు సూచించారు. సోమవారం మండల నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో పంచాయతీల అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేటాయించనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు రూ.13 కోట్లు మంజూరు చేశామని, ఈ నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల కోసం పల్లె పండగ పేరుతో ప్రతి గ్రామంలో భూమి పూజ కార్యక్రమం సోమవారం నుంచి నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఈశ్వరరావు, జెడ్పీటీసీ రమణమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీరంగ స్వామి పాల్గొన్నారు.



జగనన్న సంకల్పం.. నేడు సాకారం

కళాశాలలో సీట్ల వివరాలు

మొత్తం	:	50
చేరిన వారు	:	42
రాష్ట్ర కోటా	:	20
ఎన్ఆర్ఐ కోటా	:	4
సెల్ఫ్ ఫైనాన్స్	:	14
అలిండియా కోటా	:	4

- పాడేరులో వైద్య కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి
- 50 సీట్లతో అందుబాటులో వైద్య విద్య

గిరిజనులకు మంచి చేయాలన్న సంకల్పంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు పేరిట పాడేరు కేంద్రంగా గిరిజన ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసి పాలనను మరింత చేరువ చేశారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందుబాటులోకి తెచ్చారు. గిరిజనులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, యువతకు వైద్య విద్య అందుబాటులోకి తేవాలన్న ఆయన ఆశయం సాకారమయ్యేవేళ ఆసన్నమైంది. పాడేరులో రూ.500 కోట్లతో గత ప్రభుత్వం చేపట్టిన వైద్య కళాశాల సోమవారం ప్రారంభం కానుండటంతో గిరిజనుల్లో ఆనందం నెలకొంది.

సాక్షి,పాడేరు: స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి ఉన్నతవైద్యం అంటే తెలియని గిరిజనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం న్యాయం చేసింది. 2019 ఎన్నికల ప్రచారానికి పాడేరు వచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అధికారంలోకి రాగానే ఇక్కడ వైద్య కళాశాలను ఏర్పాటు చేసి వైద్య విద్యతోపాటు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తెస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారం చేపట్టిన వెంటనే రూ.500 కోట్లతో వైద్య కళాశాలను మంజూరు చేశారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో 35ఎకరాల విస్తీర్ణంలో మూడు బ్లాక్‌ల్లో వైద్య కళాశాల భవన నిర్మాణం గత ప్రభుత్వం చేపట్టింది.

కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు..

పాడేరు మెడికల్ కళాశాలలో 50 సీట్లతో వైద్యవిద్య ప్రారంభానికి జాతీయ మెడికల్ కౌన్సిల్ గత నెల అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. ఇప్పటి వరకు 42మంది విద్యార్థులు కళాశాలలో ప్రవేశాలు పొందగా, మరో 8మంది చేరాల్సి ఉందని ఆమె తెలిపారు.

యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు

సోమవారం నుంచి వైద్యవిద్యను ప్రారంభించాలని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఉత్తర్వులు జారీ చేయడంతో తరగతుల నిర్వహణకు అవసరమైన భవనాలతోపాటు హాస్టల్ బ్లాక్‌ను అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసింది.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

వైద్య కళాశాల ప్రారంభ ఏర్పాట్లపై కలెక్టర్ దినేష్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. తరచూ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. నాణ్యతలో లోపాలను సహించేది లేదని హెచ్చరించారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు జాగ్రత్త వహించారు. తరగతులు నిర్వహించే బ్లాక్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించారు.

- వైద్య కళాశాలకు సంబంధించి ఫ్యాకల్టీలో 70 శాతం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే నియమించింది. పాలిటెక్నిక్ సమీపంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పతి భవన నిర్మాణం పూర్తి అయ్యేందుకు మరో ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో జిల్లా సర్వజన ఆస్పత్రిలోనే రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ఈ ఏడాది జనవరిలో సుమారు రూ.2కోట్లతో జిల్లా సర్వజన ఆస్పత్రిని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసింది.
- వైద్య కళాశాలను దృష్టిలో పెట్టుకుని 420 పడకలు అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిని పరిశీలించిన జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. వైద్య కళాశాలకు అనుబంధంగా సేవలందించడం వల్ల గిరిజనులకు ఉన్నత వైద్యం అందనుంది.

తల్లిదండ్రులతో వచ్చా



పాడేరు వైద్య కళాశాలలో సీటు రావడం అదృష్టంగా భావిస్తున్నా. కొత్త కళాశాల వ్యూ, తరగతులు, హాస్టలు నిర్వహించే బ్లాక్‌లను ఆకర్షణీయంగా నిర్మించారు. ఆహ్లాదకరంగా ఉండే గిరిజన ప్రాంతంలో వైద్య విద్యను అభ్యసించే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

– కె.భావన, వైద్య విద్యార్థి,గుంటూరు

కార్పొరేట్ స్థాయిలో భవనాలు



కొత్తగా నిర్మించిన పాడేరు వైద్య కళాశాల కొత్త భవనం బాగుంది.అన్ని సౌకర్యాలతో అందంగా నిర్మించారు.అన్ని బ్లాక్‌లు పరిశీలించారు. కార్పొరేట్ స్థాయిలో నిర్మించారు.ఇక్కడ వాతావరణం కూడా నచ్చింది.తరగతులు ప్రారంభమవుతుండడం ఎంతో సంతోషంగా ఉంది.

– పి.దిలీప్‌రెడ్డి, వైద్య విద్యార్థి, వైఎస్సార్ కడప

'దేవర' ఫేం తారక్ పొన్నప్ప సందడి



దేవర ఫేం తారక్ పొన్నప్పకు నూకాంబిక చిత్రాన్ని బహూకరిస్తున్న ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమానులు

తుమ్మపాల : పట్టణంలో జరిగిన విజయ దశమి ఉత్సవాలకు దేవర చిత్రంలో విలన్ పాత్రలో నటించిన తారక్ పొన్నప్ప శనివారం విచ్చేసి సందడి చేశారు. నందమూరి బాలకృష్ణ, ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మళ్ల సంతోష్, అభిమానులు మర్యాదపూర్వకంగా ఆయన్ను కలుసుకొని నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. త్వరలో రిలీజ్ కాబోతున్న దేవర 2 చిత్రంలో కూడా ప్రత్యేకమైన పాత్రలో నటిస్తున్న పొన్నప్ప పట్టణానికి రావడం చాలా సంతోషకరం విషయమని అభిమానులు భీమేష్, గిరీష్, సాయి, ప్రదీప్, మల్లిక్, సాయి, గణేష్, కుమార్ తెలిపారు. డైరెక్టర్ నక్కిన త్రినాథరావు ఆధ్వర్యంలో పట్టణ పరిసర ప్రాంతాల్లో తెరకెక్కిస్తున్న అనకాపల్లి టైటిల్ పేరు మీద చిత్రం తీయడం, అందులో తారక్ పొన్నప్ప నటించడంతో ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకంబిక అమ్మవారి ఆశీస్సులతో ఘన విజయం సాధిస్తుందని అన్నారు.

సిరులతల్లి సన్నిధిలో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో గల కనకమహాలక్ష్మి దేవస్థానంలో పది రోజులుగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా విజయదశమి రోజున కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణ కవచ ధారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. 108 బంగారు పుష్పాలతో పూజ చేసి, పలు రకాల ఫలాలు సమర్పించారు. నగరానికి చెందిన సుంకర రామ రవీంద్ర, శ్రీరామ వెంకట నరసింహం రూ.55 వేలు చొప్పున విరాళంగా చెల్లించి స్వర్ణపుష్పార్చన, ఫలముల పూజలో పాల్గొన్నారు. అమ్మవారి అలంకరణకు పట్టు చీరలను లక్కీ షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అధినేతలు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దర్శించుకున్న ప్రముఖులు

యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ, అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవి పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి



సన్యాసిరావు మృతదేహం

యలమంచిలి రూరల్: పొలంలో యూరియా జల్లుతుండగా పాము కాటువేయడంతో ఓ రైతు మృతి చెందాడు. పట్టణంలోని ధర్మవరం వీధికి చెందిన కౌలు రైతు కొలపాటి సన్యాసిరావు(53) ఆదివారం స్థానిక కల్కి పెట్రోల్ బంక్‌కు ఎదురుగా ఉన్న తన వరిపొలంలో యూరియా జల్లుతుండగా కాలిపై పాము కాటు వేసింది. విషయం తెలుసుకుని సన్యాసిరావును యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు.మృతుడికి భార్య,కుమార్తె,కుమారుడు ఉన్నారు. సన్యాసిరావు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పండగ వేళ చోటుచేసుకున్న ఈ ఘటనతో ధర్మవరం వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల లారీ కిందపడి యువకుడి మృతి



మృతుడు స్వామి(ఫైల్)

మాకవరపాలెం : కోళ్లలారీ కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోటవురట్ల మండలం జల్లూరుకు చెందిన లాలం స్వామి(25) విశాఖలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. దసరా సందర్భంగా స్వగ్రామం వచ్చిన స్వామి మండలంలోని లచ్చన్నపాలెంలో ఉన్న తన స్నేహితుడి గంగాధర్ (25) దగ్గరకు శనివారం వచ్చాడు. వీరిద్దరూ రాత్రి లచ్చన్న పాలెం నుంచి మాకవరపాలెం మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. కొండల అగ్రహారం వద్ద గల నల్లమారమ్మ ఆలయ సమీపానికి వచ్చేసరికి ముందు వెళుతున్న కోళ్ల లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో మోటార్ సైకిల్‌తో లారీ కింద పడ్డారు. ఈ ప్రమాదంలో స్వామి లారీ టైరు కిందపడి దుర్మరణం చెందగా, గంగాధర్‌కు స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ దామోదర్‌నాయుడు ఆదివారం తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య



మృతురాలు మౌనిక

ఎస్.రాయవరం: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుని ఆదివారం మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన లంకా మౌనిక (26) భర్తతో కలిసి అడ్డురోడ్డులో నివాసం ఉంటున్నారు. భర్త అప్పలనాయుడు నక్కపల్లి హెటిరో సంస్థలో పని చేస్తున్నారు. గడిచిన శుక్రవారం మౌనికకు కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక ఉరి బిగించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొన ఊపిరితో ఉన్న మౌనికను అప్పుడే ఇంటికి వచ్చిన భర్త అప్పలనాయుడు స్థానికుల సహాయంతో ముందుగా అడ్డురోడ్డు, అపై తుని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు చెప్పారు. మృతురాలి తల్లి సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పట్టపగలే ఇల్లు దోచేశారు..!

- 9 తులాల బంగారం, రూ.3 లక్షల నగదు అపహరణ



మంచంపై చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

కోటవురట్ల : పండగ సందడిలో ఓ ఇంట్లో దొంగలు పడి దోచుకుపోయారు. ఎవరూ లేని సమయంలో పట్టపగలే ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలివి. జి.సన్యాసిరాజుపాలెం గ్రామానికి చెందిన పంచదార్ల రామకృష్ణ దసరా పండగకు శనివారం తన అత్తారింటికి వడ్డాది వెళ్లాడు. ఇంటి దగ్గర ఉన్న అతని తల్లి నాగలక్ష్మి ఆదివారం ఉదయం పొలంలోకి వెళ్లింది. తిరిగి తొమ్మిది గంటల సమయంలో ఇంటికి రాగా తలుపునకు వేసిన తాళం కప్ప కనిపించలేదు. తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఆమె ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. వెంటనే కుమారుడు రామకృష్ణకు ఫోన్‌లో విషయం చెప్పడంతో వడ్డాది నుంచి హుటాహుటిన ఇంటికి వచ్చి చూశారు. బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో దాచిన సుమారు 9 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు, సుమారు రూ.3 లక్షలు నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు రామకృష్ణ మాట్లాడుతూ మద్యం షాపు టెండరు కోసం రూ.5 లక్షలు అప్పు చేసి అందులో రూ.2 లక్షలు డీడీ తీసినట్టు తెలిపాడు. మిగిలిన డబ్బులు ఇంట్లో ఉంచగా, అవి చోరీకి గురైనట్టు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి ఎస్జీఎఫ్ ఉమ్మడి విశాఖ క్రీడా పోటీలు

- ఎంపికైన క్రీడాకారులు, జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా పోటీలు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఆదివారం మీడియాకు తెలిపారు. ఈ నెల 15న అండర్-14 బాలురు, బాలికల క్రికెట్ పోటీలు అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో, అదేరోజు అండర్-14, 17(బాలురు, బాలికల) విభాగంలో ఫెన్సింగ్, బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు గోవాడ జెడ్పీ హైస్కూల్లో జరపనున్నట్లు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్జీఎఫ్ కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు తెలిపారు.

- 16న బ్యాడ్మింటన్ ఎంపికలు అండర్ 14, 17 విభాగాల్లో ఇండోర్ స్టేడియం గోపాలపట్నంలోను, కబడ్డీ అండర్ 14 ఎంపికలు జెడ్పీ హైస్కూల్ వేములపూడి, అండర్ 14, 17 ఆర్చరీ పోటీలు అరకు స్పోర్ట్స్ స్కూల్, ఫుట్‌బాల్ అండర్ 14, తాత్రా అండర్-14, 17 ఎంపిక పోటీలు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుపనున్నారు.
- 17న బాస్కెట్ బాల్ అండర్ 14, 17 పోటీలు ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సీతమ్మధార, హాకీ అండర్ 14 పోటీలు జెడ్పీ హైస్కూల్ నక్కపల్లి, అండర్ 14 ఖోఖో పోటీలు జెడ్పీ హైస్కూల్ అచ్యుతాపురంలో నిర్వహించనున్నారు.
- 18న కబడ్డీ అండర్ 17 పోటీలు జెడ్పీ హైస్కూల్ కూండ్రం, క్రికెట్ అండర్ 17 పీఎంపాలెంలోని వీడీసీఏ మైదానంలో నిర్వహించనున్నారు.
- 19న ఖోఖో అండర్ 17 పోటీలను జెడ్పీ హైస్కూల్ తుమ్మపాల, అండర్ 14, 17 చెస్ పోటీలు అనకాపల్లి జీవీఎంసీ మెయిన్ స్కూల్ సారథ్యంలో ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలో, హాకీ అండర్ 17 పోటీలు విశాఖలోని ఏయూ మైదానంలో, అండర్ 14, 17 లాన్ టెన్నిస్ పోటీలు విశాఖలో జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.
- 20న అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్, అండర్ 14,17 పవర్ లిఫ్టింగ్ పోటీలు జెడ్పీ హైస్కూల్ చెట్టిపల్లిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు గమనించి విద్యార్థులు, అర్హత పత్రాలతో హాజరు కావాల్సిందిగా కోరారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బొలేరో వాహనం



శంకరం వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బొలేరో

తుమ్మపాల : మండలంలో శంకరం గ్రామంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఆర్టీసీ బస్సును బొలేరో వాహనం ఢీకొంది. అనకాపల్లి నుంచి సబ్బవరం వైపు సర్వీస్ రోడ్డు మీదుగా ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం గట్టిగా ఢీకొట్టింది. దీంతో ఆర్టీసీ బస్సు ఎడమ చేతి వైపు ఉన్న డ్రైనేజీకి పైకి వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికులు సురక్షితంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బొలేరో డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్థానికులు కల్పించుకుని సర్దిచెప్పారు.

దుర్గమ్మ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

- కొవ్వూరు వంతెన వద్ద రోడ్డు ప్రమాదం
- 28 మందికి గాయాలు
- ఏడేళ్ల చిన్నారి రెండు కాళ్లకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన ఏడేళ్ల చిన్నారి హేమశ్రీ



చికిత్స పొందుతున్న బాధితురాలు

నర్సీపట్నం : విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా రాజమండ్రి కొవ్వూరు బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సీపట్నం మండలం, దుగ్గాడ గ్రామానికి చెందిన 28 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఏడేళ్ల చిన్నారి నల్లబెల్లి హేమశ్రీకి రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. శెట్టి మణి(42), కాళ్ల రత్నం(29), గవిరెడ్డి రాజునాయుడు(28), బంగారుతల్లి, సత్యవతి, అమ్మాజీ, నాగమణి తీవ్రంగా గాయపడ్డారు. వీరు ప్రస్తుతం నర్సీపట్నంలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌లో వైద్యం పొందుతున్నారు. మరో ఐదుగురు క్షతగాత్రులు ఏరియా ఆస్పత్రిలో వైద్య పొందుతున్నారు. వివరాలివి. దసరా సందర్భంగా దుగ్గాడ గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు అమ్మవారి మాలధరించి తొమ్మిది రోజులు దీక్ష చేశారు. మాలధారణ చేసేందుకు ఈ నెల 12వ తేదీన రెండు టాటా ఏస్ వ్యాన్‌ల్లో పిల్లా పాపలతో మొత్తం 28 మంది విజయవాడ కనకదుర్గ దర్శనానికి వెళ్లారు. 13న అమ్మవారి దర్శనం చేసుకుని మధ్యాహ్నం స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యారు. వారు ప్రయాణిస్తున్న వ్యాన్‌ల్లో ఒక వ్యాన్ మొరాయించడంతో వేరే వ్యాన్‌లో వస్తున్నారు. కొవ్వూరు బ్రిడ్జి దాటుతుండగా వెనక నుంచి గుర్తు తెలియని లారీ భక్తులు ప్రయాణిస్తున్న వ్యాన్‌లను బలంగా ఢీకొట్టింది. దీంతో వ్యాన్‌లు రెండు పల్టీలు కొట్టడంతో అందులోని 28 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురు తీవ్రగాయాల పాలయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దసరా పండగ రోజున ఈ ఘటన ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు నింపింది.

క్లుప్తంగా

జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు



కశింకోట శివాలయం ఆవరణలో జమ్మి చెట్టుకు భక్తుల పూజలు

కశింకోట: స్థానిక శివాలయంలో విజయ దశమి సందర్భంగా జమ్మి చెట్టుకు శనివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోరుకున్న కోర్కెలు తీరుతాయనే విశ్వాసంతో జమ్మి వృక్షాన్ని పూజిస్తూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు వి.కృష్ణ ఆధ్వర్యంలో శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పూజించారు.

ప్రత్యేక అలంకరణలో వెంకన్న



కొబ్బరి మొవ్వ ఆకుల మాలలతో ధ్యాన వేంకటేశ్వరస్వామి అలంకరణ

కశింకోట: కశింకోటలో ధ్యాన వేంకటేశ్వరస్వామిని కొబ్బరి మొవ్వ ఆకుల మాలలతో అలంకరించారు. వజ్ర కవచం, తులసీ మాలల అలంకరణలో శనివారం విజయ దశమి సందర్భంగా స్వామి కనువిందు చేశారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి 'పల్లె పండగ'

కశింకోట: మండలంలో సోమవారం నుంచి పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి శ్రీకారం చుడతామన్నారు. సోమవారం వెదురుపర్తి గవరపేటలో ఉదయం 11 గంటలకు, బయ్యవరంలో 11.45 గంటలకు, విసన్నపేటలో మధ్యాహ్నం 12.15 గంటలకు, కశింకోట అగ్రహారం వీధిలో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుందన్నారు. అగ్రహారంలో జరిగే కార్యక్రమానికి ఎంపీ సీఎం రమేష్ హాజరు కానున్నారని పేర్కొన్నారు.

రూ.35 వేలకు లడ్డూ దక్కించుకున్న సర్పంచ్

మాకవరపాలెం: దుర్గమ్మ మండపంలో పూజలందుకున్న లడ్డూను బూరుగుపాలెం సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ రూ.35 వేలకు దక్కించుకున్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గమ్మ మండపం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తొమ్మిది రోజులపాటు పూజల అనంతరం శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో సర్పంచ్ వెంకటరమణ రూ.35 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
విశ్వం	: సత్యనారాయణ స్క్రీన్-1
శ్వాగ్	: సత్యనారాయణ స్క్రీన్-2
వేట్టయన్	: పర్తిసాయి
వేట్టయన్	: షిర్డిసాయి
జిగ్రా	: వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	: శ్రీసత్య
మార్టిన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-32 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 258 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 169 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

వారపు సంత.. లేదు చింత

- వ్యాపారుల కోసం షెడ్ల నిర్మాణం
- మేకలు, గొర్రెలకు ప్లాట్‌ఫారం ఏర్పాటు
- సంతోషం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు



తాళ్లపాలెం సంతలో కూరగాయల వ్యాపారులకు నీడ కోసం నిర్మిస్తున్న షెడ్లు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతను అభివృద్ధి చేస్తున్నారు. జిల్లాలో జరిగే పెద్ద సంతల్లో ఒకటైన దీన్ని ప్రస్తుతం రూ.28.50 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. దీనికి నాబార్డు, పంచాయతీ నిధులను ఖర్చు చేస్తున్నారు. తాళ్లపాలెం వారపు సంత ప్రతి సోమవారం జరుగుతుంది. ప్రస్తుతం ఆశీళ్ల రూపంలో ఏటా రూ.8.02 లక్షల ఆదాయం వస్తోంది. గొర్రెలు, మేకల కొనుగోలు, అమ్మకాలు, కూరగాయల హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలు ఎక్కువగా జరుగుతాయి. ఇళ్లలో వినియోగించే మసాల సరకులు, నిత్యావసర సరకులు, వంట పాత్రలు, వ్యవసాయ ఉత్పత్తులు, సంప్రదాయ, రెడీమేడ్ వస్త్రాలు, కోళ్లు ఎక్కువగా విక్రయిస్తుంటారు. ఇక్కడ బంగారం, వెండి వస్తువులు కూడా విక్రయించడం విశేషం. గతంలో పశువుల విక్రయాలు కూడా జరిగేవి. ఇక్కడ ప్రధానంగా గొర్రెలు, మేకల సంత పెద్ద ఎత్తున జరుగుతుంది. సాధారణ రోజుల్లో లక్షల్లో లావాదేవీలు జరుగుతాయి. ఉభయ విశాఖ జిల్లాతో పాటు కాకినాడ జిల్లా నుంచి మేకలు, గొర్రెలను పెంపకందారులు, వ్యాపారులు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు, హోటళ్ల నిర్వాహకులు, ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. దసరా, కొత్త అమావాస్య, సంక్రాంతి రోజుల్లో కోట్లలో లావాదేవీలు జరుగుతాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సంత జరిగే ప్రాంతం ఏ మాత్రం వర్షం వచ్చినా చిత్తడిగా, బురదమయంగా మారడంతో కొనుగోలుదారులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి. మేకలు, గొర్రెలను నిలువరించడం కష్టంగా మారేది. ఈ నేపథ్యంలో కొనుగోలు, అమ్మకందారుల అభ్యర్థన మేరకు రూ. పది లక్షల పంచాయతీ సాధారణ నిధులతో గొర్రెలు, మేకల సంత ప్రాంతంలో సిమెంట్, కాంక్రీట్ ప్లాట్ ఫారం ఇటీవల ఏర్పాటు చేశారు. దీంతో బురద బెడద తొలగి సౌకర్యవంతంగా మారడంతో వ్యాపారులు, అమ్మకందారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గొర్రెలు, మేకల వ్యాపారులు, అమ్మకం, కొనుగోలుదారుల కోసం నీడకు షెడ్డును కూడా నిర్మించారు. దీంతో వ్యాపార లావాదేవీలకు అనువుగా మారిందని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల వ్యాపారులకు షెడ్లు..

ఇక కూరగాయల వ్యాపారులకు నీడ కోసం మొదటి విడతగా రెండు షెడ్లు నిర్మిస్తున్నారు. ఇందుకు నాబార్డు నుంచి రూ.15 లక్షలు, పంచాయతీ నుంచి రూ.3.50 లక్షలు సమకూర్చారు. వాటితో రెండు పెద్ద షెడ్లను నిర్మిస్తున్నారు. వాటిలో 40 మంది వ్యాపారులు కార్యకలాపాలు సాగించడానికి అనువుగా గ్రామీణ స్వరాజ్య సంఘ్ ప్రోత్సాహంతో నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు కూరగాయల వ్యాపారులు సొంతంగా తాటి ఆకులతో పాకలు నిర్మించుకుని వాటిలో వ్యాపారం సాగిస్తున్నారు. వర్షాలు వచ్చినప్పుడు సంత ప్రాంతం నీరు, బురదమయంగా మారి లావాదేవీలకు ఇబ్బంది పడుతున్నారు. ఏటా పాకలు నిర్మించుకోవలసి రావడంతో ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో నిర్మిస్తున్న షెడ్ల వల్ల కాస్త సౌకర్యం కలగనుందని వ్యాపారులంటున్నారు. అరకొరగా నిర్మిస్తున్న షెడ్లు అందరికీ చాలక ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందని, దీని దృష్ట్యా అందరికీ సరిపడా షెడ్లు నిర్మించి దుకాణాలు కేటాయించాలని వ్యాపారులంటున్నారు. ఇందుకు పంచాయతీ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం..

తాళ్లపాలెం వారపు సంతలో సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం. దీనిలో భాగంగా రూ.28.50 లక్షలతో అభివృద్ధి చేస్తున్నాం. పంచాయతీ సాధారణ నిధులు రూ.పది లక్షలతో గొర్రెలు, మేకల సంతలో ప్లాట్ ఫారం నిర్మాణం పూర్తి అయింది. కూరగాయల వ్యాపారుల కోసం నాబార్డు, పంచాయతీ నిధులతో షెడ్లు నిర్మిస్తున్నాం. ఇవి దాదాపు నెల రోజుల్లో పూర్తి కాగలవు. ఆశీలు రూపంలో రూ.8.02 లక్షలు ఆదాయం సమకూరుతుంది.

– ఎస్.సత్యారావు, పంచాయతీ కార్యదర్శి, తాళ్లపాలెం.

వెయిట్ లిఫ్టింగ్‌లో రేవతి ప్రతిభ



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన ఎ.రేవతి(వృత్తంలో..)

అనకాపల్లి: దేవరాపల్లి మండలం అగ్రహారం గ్రామానికి చెందిన అల్లు రేవతి జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో యూత్ జూనియర్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మాల వెంకటరామ ఆమెను అభినందించారు. హిమాచల్‌ప్రదేశ్ నగ్రోటా బగ్వాన్ జిల్లాలో యూత్ జూనియర్, సీనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకూ జరిగాయని, ఈ పోటీల్లో రాష్ట్రం తరఫున యూత్ జూనియర్ విభాగంలో ఎ.రేవతి పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించడం అభినందనీయమని గుమ్మాల అన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



వెదురుపర్తిలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో ఆదివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థి మేలుకో కార్యక్రమంలో భాగంగా గణిత ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి ఇంటింటికి వెళ్లి టెన్త్ విద్యార్థుల చదువుతీరును పరిశీలించారు. బాలిక దినోత్సవ ప్రాధాన్యతను ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లులతో సమావేశమై వివరించారు. బాలికలను నిర్లక్ష్యం చేయకుండా వారి ఉన్నతికి ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలు చేయరాదన్నారు. ప్రభుత్వం బాలికల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు.

అపూర్వ సమ్మేళనం



సమావేశమైన 1995-2000 మధ్య విద్యనభ్యసించిన విద్యార్థులు

కోటవురట్ల: చిన్నతనం నుంచి కలిసి చదువుకుని, ఎవరికివారే వేరై ఎక్కడెక్కడో సెటిలై మళ్లీ కలుసుకుంటే ఆ మజాయే వేరు. పదో తరగతి వరకు కలిసిమెలసి చదువుతూ, చిలిపి చేష్టలతో గురువుల బెత్తం దెబ్బలు తింటూ గడిపిన ఆ రోజుల మధుర స్మృతులు, ఆ స్నేహ బంధం జీవితాంతం పెనువేసుకునే ఉంటుంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–2000 మధ్య విద్యను అభ్యసించిన అప్పటి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఆనాటి తీపి గురుతులను స్మరణకు తెచ్చుకుని ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. తమ ఉన్నతికి కారణమైన గురువులను సత్కరించారు. సహపంక్తి భోజనం చేసి ఆటపాటలతో ఉత్సాహంగా కాలక్షేపం చేశారు.

త్వరలో అందుబాటులోకి యూరియా

తుమ్మపాల: మండలంలో యూరియా కొరతపై అధికారులు స్పందించారు. రెండు రోజుల్లో మండలంలో కూండ్రం, వెంకుపాలెం, మార్టూరు, శంకరం, గొలగాం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులోకి తీసుకురానున్నట్లు మండలం వ్యవసాయ అధికారి పి.రంగాచారి తెలిపారు. వరి పంటకు యూరియా కొరతపై ఈ నెల 12న 'యూరియా–ఏదయా?'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు రైతులకు యూరియా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఇండెంట్ పెట్టినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

జనవరిలో శ్రీనివాస కల్యాణం

- టీటీడీ పండితులతో నాతవరంలో నిర్వహణకు ఏర్పాట్లు
- పోస్టర్ విడుదల



శ్రీనివాస కల్యాణం పోస్టరు విడుదల చేస్తున్న మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు, కమిటీ సభ్యులు

నాతవరం : మండల కేంద్రంలో సంక్రాంతికి తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులతో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నామని ఎన్ఆర్ఐ శెట్టి శిరీష్ తెలిపారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను విజయదశమి పండగ సందర్భంగా శ్రీశక్తి పంచాయతన ఆలయంలో మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతల విజయకుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ విడుదల చేశారు. ఉత్సవ వివరాలు వెల్లడించారు. జనవరి 10వ తేదీన శ్రీవారి ఆనంద నిలయంలో ఉత్తర ద్వార దర్శనం, 11న సుప్రభాత సేవ నుంచి పవళింపు సేవ వరకు తిరుపతిలో స్వామి వారికి ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే అన్ని రకాలు సేవలు ఇక్కడి భక్తులకు కళ్లకు కట్టినట్లుగా తిరుమల వేద పాఠశాల అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఇంతవరకు మండలంలో ఎక్కడ కూడా శ్రీనివాస కళ్యాణం జరగలేదన్నారు. శ్రీనివాస కల్యాణంలో పూజ చేయించుకునే భక్తులు ముందుగా ఆలయం వద్ద తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీశక్తి పంచాయతన ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. శరణు శరణు

- ఘనంగా దసరా సంబరాలు
- ముగిసిన శరన్నవరాత్రి వేడుకలు



గౌరీ పంచాయతీ అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేస్తున్న అర్చకులు



నూకాంబిక అమ్మవారి బాలాలయంలో పూర్ణాహుతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు



కశింకోట శివాలయంలో సర్వమంగళాంబకు సమర్పించిన లడ్డూలు



కశింకోటలో రాజరాజేశ్వరి దేవి అవతారంలో కనకదుర్గమ్మ



వెదురుపర్తిలో దుర్గాదేవి అలంకరణ



కనకదుర్గమ్మ ఊరేగింపులో పాల్గొన్న మలసాల భరత్‌కుమార్, నివేదిత దంపతులు



కనకదుర్గమ్మ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భవానీ భక్తులు



నూకాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అవభృథ స్నానం చేస్తున్న అర్చకులు

అనకాపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. దసర సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి, తమను కరణించమని వేడుకున్నారు. ఉత్సవ కమిటీలు ఆధ్వర్యంలో ఆలయాలు వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమలను మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా వెలుగుల మధ్య ఘనంగా ఊరేగించి, నిమజ్జనం చేశారు.

- ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో ఆదివారం పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి(నూకాంబిక ఉత్సవమూర్తి) విగ్రహానికి అవభృథ స్నానాన్ని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో ఎన్.సుజాత దంపతులు నిర్వహించారు.

గౌరీపంచాయతన ఆలయంలో..

గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో ప్రధానార్చకుడు అంపోలు గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి నిజరూపదర్శనం భక్తులకు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తుమ్మపాల: విజయ దశమి సందర్భంగా కనకదుర్గమ్మ ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో తుమ్మపాల, కొత్తూరు, మార్టూరు, మామిడిపాలెం, రేబాక, శంకరం, కొప్పాక గ్రామాల్లో భవానీ భక్తులు అమ్మవారికి భజనలు చేసి తుది పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. నవరాత్రులు పూర్తవడంతో గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమలను శని, ఆదివారాలు చిడతలు, కాంగో, డప్పులు, వాయిద్యాలతో సందడిగా గ్రామ వీధుల్లో భారీ ఊరేగింపులు చేపట్టి సమీపంలో జలాశయాల్లో నిమజ్జనం చేశారు. మండలంలో కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, బాటజంగాలపాలెం, రామాపురం, కూండ్రం, కుంచంగి, సీతానగరం, వెంకుపాలెం, పలు గ్రామాల్లో అమ్మవారి ప్రతిమలను శారదా నదిలోను, తుమ్మపాల, శంకరం, రేబాక, బట్లపూడి, గొలగాం, కోడూరు, కొప్పాక, తదితర గ్రామాల్లో అమ్మవారి ప్రతిమలను ఏలేరు కాలువలోను నిమజ్జనం చేశారు.

అనకాపల్లి: స్థానిక 80వ వార్డు గవరపాలెం వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌నగర్‌లో న్యాయవాది డి.వి.నర్సింగరావు ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, నివేదిత దంపతులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెంటకోట శ్రీను, కాండ్రేగుల రాము, బుద్ధ నర్సింగరాజు, పరమేష్, మైలపల్లి నూకరాజు, శ్యాం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోట శివాలయంలో సర్వమంగళాంబను రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి లడ్డూలు నివేదించారు. ఆలయ అర్చకుడు వి.చిదంబరం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఇక్కడి జాతీయ రహదారి వద్ద కొలువైన కనకదుర్గ ఆలయం శని, ఆదివారాల్లో భవానీ, సాధారణ భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి కుంకుమార్చనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ అమ్మవారిని దర్శించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ప్రసాద్‌బాబు కండువా కప్పి అమ్మవారి చిత్ర పటాన్ని అందజేశారు. వెదురుపర్తి గ్రామంలోని దుర్గాదేవిని పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. అర్చకుడు శంకరరావు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. గవరపేట, కస్పావీధి, పెద్ద బజారు, దాడి వారివీధి, కనకమహాలక్ష్మి వీధి, పూసర్లవీధి, గోవిందరావు కాలనీ, హౌసింగ్ కాలనీ, సత్తెమ్మ కాలనీ, అమరపల్లి వీధి, తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ ట్రాక్టర్లపై ఊరేగించారు. అనంతరం స్థానిక శారదా నదిలో నిమజ్జనం చేశారు. తాళ్లపాలెంతో పాటు మండలంలోని గ్రామాల్లో నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

వైభవంగా కనకదుర్గమ్మ తిరుగు రథోత్సవం



కనకదుర్గమ్మవారి ఊరేగింపులో భక్తులు

అనకాపల్లి: విజయ దశమి సందర్భంగా గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ తిరుగు రథోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సీతారామ మందిరం నుంచి ప్రారంభమైన రథోత్సవం నెహ్రూచౌక్, ఎన్టీఆర్ క్రీడా మైదానం, వేల్పులవీధి జంక్షన్, మెయిన్ రోడ్డు, పెరుగుబజార్ జంక్షన్, రింగ్ రోడ్డు మీదుగా గవరపాలెం పురవీధుల్లో సాగింది. సతకంపట్టు కనకదుర్గమ్మవారిని సినీహీరో సందీప్ కిషన్, డైరెక్టర్ నక్కిన త్రినాథ్, చిత్రీకరణ దశలో ఉన్న అనకాపల్లి కుర్రోళ్లు సినిమా హీరో లగడపాటి విక్రమ్ సహిదేవ్, హీరోయిన్ సంధ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారిని కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. వేడుకల్లో నేలవేషాలు, స్టేజ్ ప్రోగ్రాంలు ఆకట్టుకున్నాయి. 15 ట్రాక్టర్లపై వివిధ రూపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ఊరేగించారు. ఉత్సవంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు విజయకుమార్, వెంకటనారాయణ బందోబస్తును ఏర్పాటు చేశారు. జాతరలో ఒడిశా, కేరళ, తాడేపల్లిగూడెం, ఏలూరు, విశాఖ, విజయనగరం కళాకారులు సందడి చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



సినీహీరో సందీప్ కిషన్, డైరెక్టర్ నక్కిన త్రినాథ్‌ను బెల్లం దండతో సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



ట్రాక్టర్‌పై కనకదుర్గమ్మవారు ఊరేగింపు